
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 జూన్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





అజీజ్‌తో గిరిధర్‌రెడ్డి భేటి

ప్రజాశక్తి -నెల్లూరు :టిడిపిలో ఇటీవల చేరిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో ఆదివారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. నెల్లూరు నగరంలోని హరనాథపురంలోని అబ్దుల్ అజీజ్ నివాసానికి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చేరుకొని అజీజ్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల అబ్దుల్ అజీజ్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొంది నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అబ్దుల్ అజీజ్ ఆరోగ్యం త్వరగా కుదుట పడాలని ఆకాంక్షించారు. ఇద్దరు నేతలు సుమారు అరగంటసేపు పలు అంశాలను పిచ్చాపాటిగా చర్చించారు.



అబ్దుల్ అజీజ్‌ను కలిసిన టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

'ఆనం'పై దాడికి యత్నం..!

- అల్లరి మూకల దాష్టీకం
- వైసిపి ప్రయత్నంగా అనుమానం
- టిడిపి నేతల ఆగ్రహం

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎసి సుబ్బారెడ్డి మనుమడు ఆనం వెంకట రమణారెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి ప్రయత్నించారు. అయన సన్నిహితులు ప్రతి ఘటించడంతో అక్కడ నుంచి పరారయ్యారు. ఈ సంఘటన ఆదివారం నెల్లూరు నగరంలో జరిగింది.

కొద్ది రోజులుగా రెక్కీ నిర్వహించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం ఆర్‌టిఒ ఆఫీసు రోడ్డులోని ఓ స్నేహితుని అపార్ట్‌మెంట్‌కు వెళ్లారు. అప్పటికే ఆనం వెంకటరెడ్డి అక్కడకు వచ్చారని తెలుసుకున్న ఆ వ్యక్తులు కర్రలతో అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించారు. వెంకటరెడ్డి అపార్ట్‌మెంట్ దిగి వస్తుండగా కర్రలతో దాడికి ప్రయత్నించారు. వెంటనే తేరుకున్న ఆయన మిత్రుడు శికింధర్‌రెడ్డి అడ్డు కోవడంతో ఆయన కింద పడిపోయారు. ఆయనకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఆనం వెంకటర మణారెడ్డి కూడా దుండగులను పట్టుకోడానికి పరుగులు తీయడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. రెండు బైక్‌లను అక్కడే వదిలి వెళ్లిపోయారు. ఆనం వెంకటరమణారెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు. ఆయన స్నేహితుడు శికింధర్‌రెడ్డికి స్వల్ప గాయాలై అస్వస్థతకు గురికావడంతో స్థానిక అపోలో ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే టిడిపి నేతలు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే ఆస్పత్రికి తరలివచ్చారు. ఇటీవల కాలంలో ఆనం వైసిపి ప్రభుత్వ,ం ముఖ్యమంత్రిపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు ప్రాంతానికి చెందిన కొందరు గంజాయి బ్యాచ్ దీనికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీని వెనుక వైసిపి నేతలున్నారని టిడిపి నేతలు ఆరోపిస్తున్నారు. టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సంఘటనా స్థలం చేరుకొని పరామర్శించారు. ఆస్పత్రిలో మాజీ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి కూడా పరామర్శించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, అచ్చ న్నాయుడు, జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర, తదితరులు ఫోన్‌లో పరామర్శించారు. ఆనం వెంకట రమణారెడ్డిని పరామర్శించారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్వయంగా కలిసి పరామర్శించారు.



చికిత్స పొందుతున్న ఆనం స్నేహితుడిని పరామర్శిస్తున్న టిడిపి నేత సోమిరెడ్డి

ఇది వైసిపి నేతల పనే : సోమిరెడ్డి

ఆనం వెంకటరమణారెడ్డి వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఆయన ప్రాణాలను తీసేందుకు దుండగలు పాల్పడ్డారని, ఇది వైసిపి పనేనని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. గంజాయి ఆ బ్యాచ్‌ని పంపింది ఎవరు...వైసిపి జిల్లా నాయకులా, రాష్ట్ర నేతలా, జిల్లా మంత్రా, ఎంఎల్‌ఎలా తేలాల్సిందేనన్నారు. వైసిపి దురాగతాలను ఎండగడు తున్నందుకే ఆనం వెంకట రమణారెడ్డిపై దాడి చేశారన్నారు. గంజాయి మత్తులో ఏం చేస్తారో కూడా తెలియని బ్యాచ్‌ను వెంకట రమ ణారెడ్డిపై దాడికి పంపారన్నారు. అదృష్టవశాత్తు వారిని మనుబోలు సికింధర్ రెడ్డి అడ్డుకుని ప్రతిఘటిం చారన్నారు. లేదంటే ప్రమాదం జరిగేదన్నారు. ఎసి సుబ్బారెడ్డి మనవడికి దాడి జరిగిందని.. పోలీసులకు సమాచారం అందిస్తే ఒక్క కానిస్టేబుల్‌ను పంపుతారా అని ప్రశ్నించారు. ఎపిలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుతో తమను తామే కాపాడుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. విద్యావంతుడైన ఆనం వెంకట రమణారెడ్డి స్పష్టమైన ఆధారాలతో నిలదీస్తుం డటంతో వైసిపి నాయకత్వం దిక్కుతోచని స్థితికి చేరిందన్నారు. ఎపిలో వైసిపి నేతల ఫ్రస్టేషన్ పరాకష్టకు చేరిందన్నారు. సర్వే రిపోర్టులన్నీ వ్యతిరేకంగా ఉండటంతో భౌతిక దాడులకు దిగుతున్నారన్నారు. నెల్లూరు జిల్లా రాజకీయ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా దాడుల సంస్కృతికి తెరలేపారన్నారు.

రైలు ప్రమాద ఘటనపై

న్యాయ విచారణ చేపట్టాలి

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి - సిపిఎం డిమాండ్



సిపిఎం నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద ఘటనపై న్యాయ విచారణ చేపట్టాలని, వ ఘటనకు కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి బాధిత కుటుంబాలను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, అనంతరం ధర్నా చేపట్టారు. సిపిఎం నగర కమిటీ కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అను సరిస్తుందన్నారు. అందులో భాగంగా రైల్వేను ప్రయివేటీకరణ చేసేందుకు అను సరిస్తున్న విధానాల ఫలితంగానే ఇటువంటివి ఘటనలు చోటుచేసుకుంటు న్నాయన్నారు. ఈ రైలు ప్రమాదపు ఘటన బిజెపికి కనువిప్పు కలిగిన ప్రయివేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న సుమారు 4 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. భద్రతా వ్యవస్థను పటిష్టం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను, గాయపడి వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు ఆర్ నగేష్ మాట్లాడుతూ 13లక్షలకు పైగా ఉన్న రైల్వే ఉద్యోగులు నేడు 9 లక్షలకు చేరుకున్నారన్నారు. రైళ్ల పెరిగి,లైన్లు పెరుగుతున్నా అదనపు ఉద్యోగాలు కల్పిం చాల్సింది పోయి ఉన్న ఉద్యోగాలలో కోత విధిస్తున్నారన్నారు .ప్రయివేటీ కరణ విధానాల వల్ల ఫలితంగా భద్రత వ్యవస్థ ప్రమాదంలో పడుతుందన్నారు. ఫలితంగా ఇటు వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం జరిగిన ఘటనకు నైతిక బాధ్యత వహించాలన్నారు. రైలు ప్రమాదంలో మతి చెందిన గాయపడిన బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, మూలం ప్రసాద్, చంగయ్య, వేణు, శాఖ కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, నారాయణ,ఫయాజ్, అమాన్ పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : బిజెపి ప్రభుత్వం చేపట్టిన రైల్వేల ప్రయివేటీకరణ విధానాల ఫలితమే ఒడిశ్సా ఘోర రైలు ప్రమాదానికి కారణమని ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా ఆరోపించారు. ఒడిశ్సాలో రైలు ఘోర ప్రమాదాన్ని పురస్కరించుకొని తోటపల్లిగూడూరు పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం కొవ్వొత్తులతో ర్యాలీ జరిగింది. సిపిఎం ఇస్కపాలెం శాఖ అధ్యక్షులు బండి శౌరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజా పాల్గొని మాట్లాడారు. నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్షులు నాసిన పరుశురామయ్య, ట్రెజరర్ శివ, సాలిపేట సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్షులు రమేష్, ట్రెజరర్ మణి, ఇస్కపాలెం సిపిఎం ప్రతినిధులు బలసా చెంచు లక్ష్మీ, చలపతి, ఎంబేటీ ఏడుకొండలు, నరుకూరు సెంటర్, సాలిపేట సెంటర్ ఆటో యూనియన్ల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.



తోటపల్లి గూడూరు మండలం, నరుకూరులో..



విద్యా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : వికలాంగ విద్యార్థుల అభ్యున్నతి కోసం విద్యా ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్ఐ జంపాని కుమార్ పేర్కొన్నారు.మండలంలోని చిన్నచెరుకూరు గ్రామానికి చెందిన పావని అనే వికలాంగ విద్యార్థిని అభ్యున్నతి కోసం విద్యా ఫౌండేషన్ సభ్యులు గత నెల 15వ తేదీన చిన్న చెరుకూరు గ్రామంలో జిల్లా స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్ఐ జంపాని కుమార్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. వికలాంగ విద్యార్థిని పావని విద్యా, ట్రై సైకిల్ కోసం విద్యా ఫౌండేషన్ సభ్యులు చేసిన కషి అభినందనీయం అన్నారు. అనంతరం క్రికెట్ పోటీలలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొన్నా యంగ్ ఫైటర్స్ టీమ్ (కొత్తకాలువ), ద్వితీయ స్థానంలో నిలిచిన చిన్నచెరుకూరు టీమ్, మూడో స్థానాన్ని కైవసం చేసుకొన్న ఓకెపి కింగ్ టీమ్ లకు కెఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కళ్యాణ్ రెడ్డి, విద్యా ఫౌండేషన్ సభ్యులు, గ్లామ్ స్టూడియో అధినేత మస్తాన్ అందజేశారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్స వైద్య శిబిరం

ప్రజాశక్తి -వెంకటాచలం

కంటిచూపు సమస్యల నుంచి విముక్తి కల్పించి స్పష్టమైన కంటిచూపు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఉచిత కంటి పొర శస్త్ర చికిత్స వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో శంకర్ నేత్రాలయం, చెన్నై, డాక్టర్ ప్రేమ సాగర్ రెడ్డి కుటుంబ సహాయ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర చికిత్స వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జన్మనిచ్చిన మాత భూమికి సేవ చేసేందుకు పరితపిస్తున్న నిడిగుంటపాలెం వాసి, అమెరికాలో స్థిరపడిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రేమ్ సాగర్ రెడ్డి కుటుంబం పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఆయన ఇక్కడ జన్మించడం ఈ గ్రామస్తుల అదష్టమని మంత్రి కొనియాడారు. ఈ వైద్య శిబిరం ఈనెల 11వ తేదీ వరకు నిడిగుంటపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిం చనున్నారు. శ్రీహరి, రవీంద్రారెడ్డి, శంకర్ నేత్రాలయ అడ్మిన్ డాక్టర్ అరుణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది, మాజీ జెడ్పిటిసి మందల వెంకట శేషయ్య, ఇసుక పాలెం సర్పంచ్ ఎ ఏడుకొండలు కొణిదన భాస్కర్ నాయుడు మోహన్ నాయుడు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-నెల్లూరు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పి నాగసాయి సూరి తెలిపారు. నెహ్రూ యువకేంద్ర, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నేపథ్యంలో గాంధీబొమ్మ స్వతంత్ర పార్క్ నుంచి వి.ఆర్.సి. సెంటర్ వరకూ పర్యావరణ దినోత్సవ సంరంభ ర్యాలీ నిర్వహించారు. 1972 నుంచి ఐక్యరాజ్య సమితి బహత్ కార్యంగా పర్యావరణ దినోత్సవాన్ని ముందుకు తీసుకుపోతోందని, అదే విధంగా ఈ ఏడాది ప్రధానం ప్లాస్టిక్ వాడకం విషయంలో అవగాహన కల్పించే ప్రయత్నాలు చేస్తోందన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మురళీ మోహన్ మాట్లాడుతూ ఈ దినోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాలు, ఆహార దుబారాను అరికట్టడం, ప్లాస్టిక్ బ్యాగుల నిషేధం, మొక్కలు నాటడం, వ్యర్థంగా పడేసిన వస్తువుల పునర్వినియోగం వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ లేబర్ కమిషనర్ రాచపాలెం రఘు , గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరవ రాయప్ప, డా కొండూరు హరినారాయణ రెడ్డి, అనురాధ, యోగా మాస్టర్ రవీంద్ర, అందె శ్రీనివాసులు, పి.వి.రెడ్డి, లక్ష్మీ నారాయణ, మహేష్ పాల్గొన్నారు.



అడహక్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు : ఆయుష్మాన్ భారత్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అడహక్ కమిటీ ఎన్నికలు ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎన్‌జిఒ భవన్‌లో నిర్వహించిన ఈ ఎన్నికలకు అధికారిగా ఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా అసోసి యేట్ అధ్యక్షులు ఎన్.ఆంజనేయవర్మ, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా నగర అధ్యక్షులు చిలకా రామకృష్ణారెడ్డి, అబ్జర్వర్‌గా ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. రామకృష్ణ వ్యవహరించారు. అడహాక్ బాడీ జిల్లా చైర్మన్‌గా ఎస్.రెబైకా, కోచైర్మన్‌లుగా టి.సుమాంజలి, ఎం.జ్యోతి, కె. మౌనికా, జిల్లా కన్వీనర్ గా జి.చంద్ర మౌళీ,కో.కన్వీనర్లుగా యస్ డీ అస్మతు న్నీసా,హైజాక్,తేజ సాయి కుమార్,జిల్లా కోశాధికారిగా టి.తిరుమలయ్య ఎన్నికయ్యారు. ఎన్‌జిఓ సంఘంజిల్లా అధ్యక్షులు ఎం పెంచలరావు, కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, ఉపాధ్యక్షులు ఈ.కరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - లింగసముద్రం

లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 1987-92బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలల్లో జరిగింది. 30 ఏళ్ల తర్వాత తిరిగి వాళ్లు చదువుకున్న చోట కలుసు కున్నారు.ఈ సందర్భంగా వారు గత అను భావాలను, అనుభు తులను పంచుకుంటు ఆనందంగా గడిపారు.రిటైర్డ్ ప్రధా నోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి శేషయ్య మాట్లాడుతూ 30 ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవడం, ఆనందంగా ఉందన్నారు. అనంతరం శేషయ్యను,రిటైర్డ్ పిడి ఉమ్మడిశెట్టి వెంకటరత్నంను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో లింగసముద్రం, పెదపవని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు కె.సూర్యప్రకాశ్‌రావు,ఉమ్మడిశెట్టి మాధవరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో సైకిల్ స్టాండ్ ఏర్పాటు

తమకు విద్యా బుద్ధులు నేర్పించిన పాఠశాలకు, విద్యార్థుల కు అవసరమైన సైకిల్ స్టాండ్‌ను ఏర్పాటు చేయడానికి పూర్వ విద్యా ర్థులు నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సైకిల్ పెట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని వారికి సైకిల్ స్టాండ్ ఏర్పాట్లుకు ముందుకు వచ్చారు. త్వరల్లోనే పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటుల్లో తెస్తామని చెప్పారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి -వెంకటాచలం

చింతలపాలెంలో శనివారం కాలువలో పడి మతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని మండలం టిఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం వారు ఇక్కడ మాట్లాడారు. ఇటీవల మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి సొంత గ్రామం తోడేరులో చెరువులో పడి కొందరు మరణిస్తే వారికి పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందజేశారన్నారు. చింతలపాలెంలో దళిత విద్యార్థులు మరణిస్తే వారి కుటుంబాలకు రూపాయి కూడా ఆర్థిక సహాయం అందించలేదన్నారు. దళితులపై, విద్యార్థులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వారి కుటుంబాలకు ఆదుకోవాలన్నారు. క్కొక్క కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మనోజ్, దేవ కుమార్, ఈశ్వర్, సండి చంద్రమోహన్, రవి, సురేష్, మణేంద్ర ఉన్నారు.



క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-బిట్రగుంట

మానసిక వికాసానికి క్రీడలు చాలా అవసరమని డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్ సందర్భంగా ఆదివారం పిల్లలకు పౌష్టికాహారాన్ని డాక్టర్ చంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా అభివృద్ధి సంస్థ ద్వారా జరుగుతున్న ఫుట్బాల్ సమ్మర్ క్యాంపు 8వ తేదీన ముగిస్తున్నందున, సమ్మర్ క్యాంప్ లో పాల్గొనిన క్రీడాకారులకు వాకర్స్ అసోసియేషన్ వారు జెర్సీలు, లోయర్లు ,ఫుట్బాల్ షఉల ను అందజేస్తారని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు శశి కుమార్, డాక్టర్ ఆనంద్ సాగర్, ఏ కె సుందర్ రాజ్, శ్రీనివాసులు, జనార్ధన్, చప్పిడి రవి, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బాలసుబ్రమణ్యం జయంతి వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని డాక్టర్ ఎస్‌పి బాలసుబ్రమణ్యం సంగీతం పాఠశాలలో ఆదివారం గాన గంధర్వ డాక్టర్ ఎస్‌పి సుబ్రహ్మణ్యం గారి 77 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రిన్సిపల్ జ్యోతిర్మయి బాలు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర పరిశ్రమలో బాలు యుగం స్వర్ణయుగమని, ఆయన పాడిన పాట ప్రతిదీ ఆణిముత్యమే నన్నారు. దాదాపు అన్ని భాషల్లో కలిపి 45 వేల గీతాలు ఆలాపన చేసి పద్మశ్రీ, పద్మ భూషణ్ , పద్మ విభూషణ్ వచ్చి అత్యున్నత పురస్కారాలు అందుకున్న మహోన్నతమైన వ్యక్తి అన్నారు. అటువంటి వ్యక్తి ప్రజల మనస్సులో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కళాశాల అధ్యాపకులు సాయిబాబా, పినాకపాణి మల్లికార్జున , తిరుపతమ్మ కుమారి వైష్ణవి పారాయణ ఉన్నారు.

తోటపల్లిగూడూరు : తమిళనాడులో ఎస్‌పి



బాలసుబ్రమణ్యంకు ఆదివారం ఘన నివాళు లర్పించారు.గాన గంధర్వరుడు డాక్టర్ ఎస్‌బిబి 77వ జయంతిని పు రస్కరించుకొని అఖిల భారత తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో, ప్రముఖ రక్తనాళాల శస్త్ర చికిత్స నిపుణులు, ప్రొఫెసర్, డాక్టర్ చిల్లకూరు ముద్దు కష్ణారెడ్డి (సిఎంకె రెడ్డి) సారథ్యంలో బాలసుబ్రమణ్యంకు ఘనంగా నివాళులర్పించింది. ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి బాలసుబ్రమణ్యం తన బహుముఖ స్వరంతో భారతీయ సంగీతాన్ని సుసంపన్నం చేసాడని కొనియాడారు. అఖిల భారత తెలుగు సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటినుంచి జగనన్నకు చెబుదాం..

ప్రజాశక్తి-వరికుంటపాడు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం జరుగనున్నట్లు ఎంపిడిఒ విజయభాస్కర్ రావు తెలిపారు. మండల స్థాయి అధికారులంతా తప్పనిసరిగా హాజరై ప్రజలు సమస్యలపై వినతి పత్రాలు ఇస్తే వినతులను తీసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి

హ్యూప్ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కావలి పట్టణ బుడంగుంట గిరిజన కాలనీలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యూప్ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా మాట్లాడుతూ దాసరి ప్రసాద్, దాసరి కోమలి కుమారుడు రిత్విక్ పుట్టినరోజు సందర్భంగా 26వార్డు ఇన్‌ఛార్జి వేమిరెడ్డి విజయకుమార్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ "ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న" అని ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవార్చుకోవాలని తెలిపారు. హ్యూప్ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా, జాగర్లపూడి సాయిశివ, సయ్యద్‌హాఫీజ్‌అలీ, కాగొల్లు రామచంద్ర సేవలు అందించారు.

విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా హాజరైన విద్యార్థులకు పర్యావరణం, మొక్కలు, మూఢనమ్మకాలు, దేశభక్తి గీతాలు తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.సి.కృష్ణయ్య హాజరయ్యారు. విద్యార్థులకు చిన్ననాటి నుండి సైన్స్ విజ్ఞానం అలవర్చుకోవడంతో పాటు ప్రశ్నించే తత్వం నేర్చుకోవాలన్నారు. అప్పుడే చిన్నపిల్లల సందేహాలు సరైన సమాధానాలు దొరుకుతాయని ఆయన ఒక ప్రసంగంలో తెలిపారు. అనంతరం ఆయన పర్యావరణ మూఢనమ్మకాలు దేశభక్తి గీతాలు విద్యా ప్రాముఖ్యత గురించి పాటల రూపంలో చక్కగా పాడి పిల్లలను అలరించారు. పిల్లలు తయారుచేసిన పేపర్ క్రాఫ్ట్ సందర్శకులను ఆకర్షించింది. పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. లైబ్రేరియన్ ఇంచార్జ్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ 5వ తేదీ గ్రంథాలయంలో కోవిడ్ ప్రభావిత వివిధ దేశాల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు అధిక సంఖ్యలో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లైబ్రరీ రికార్డ్ అసిస్టెంట్ వనజ పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై దాడి అన్యాయం

ప్రజాశక్తి-ఉదయగిరి

టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డిపై జరిగిన దాడి పిరికిపంద చర్య, దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని టిడిపి మండల అధ్యక్షులు చింతలపూడి బయన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి, సీకిందర్ రెడ్డిలపై జరిగిన దాడిని మండల పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపి వైఫల్యాలను ఎత్తిచూపుతున్న ప్రతిపక్ష నాయకులపై దాడి చేయడం దుర్మార్గమని వారి వైఫల్యాలను సరిదిద్దుకోవాల్సిన నాయకులు ప్రతిపక్షాలపై దాడి చేసి భయభ్రాంతులను చేసి తమ తప్పులను కప్పిపుచ్చుకోవాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి నేతలపై ఎన్ని దాడులు చేసినా ఎన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రజా పక్షాన నిలబడి పోరాడుతాం తప్ప వెనుకకు తగ్గేదే లేదని, దాడికి పాల్పడిన వైసిపి అల్లరి మూకలను తక్షణమే అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కామాక్షితాయి సేవలో కలెక్టర్, కమిషనర్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



నెల్లూరు జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ హరి నారాయణ్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం జొన్న వాడలో వెలసి ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి శ్రీవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ఛైర్మన్ పుట్ట లక్ష్మి సుబ్రహ్మణ్యం నాయుడు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు అతిథులను స్వాగతించి స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. అలయ అర్చకులు దాతలకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం అతిథులను శ్రీవార్ల శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-జలదంకి

మండలంలోని అన్ని గ్రామాల నుండి రికార్డు స్థాయిలో 26 టీములు పాల్గొన్న క్రికెట్ టోర్నమెంటను కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జలదంకి మండలం జమలపాలెం గ్రామంలో జరిగిన టోర్నమెంట్‌లో ఫైనల్ కు చేరుకున్న జమ్మలపాలెం టీం, చేమాడ టీముల మధ్య మ్యాచ్ ఉత్కంఠ ఆసక్తికరంగా సాగింది. చివరికి జమ్మలపాలెం టీం విజేతగా నిలిచి కప్ కైవసం చేసుకొంది. కార్యక్రమంలో మాజీ టిడిపి మండల ఉపాధ్యక్షులు తమ్మినేని మధుసూదన్ రావు, కొల్లా కృష్ణయ్య, మదన్, మనోజ్, మార్కెట్ బ్రహ్మారెడ్డి, నిమ్మలపల్లి రామ్, పుప్పం రోసిరెడ్డి, ముచ్చల మధుసూదన్ రెడ్డి, వెలమూరి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

19వ వార్డులో కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా వైఎస్‌ఆర్‌సిపి ఎస్.సి. సెల్ అధ్యక్షులు,వార్డు మాజీ కౌన్సిలర్, న్యాయవాది, పందిటి కామరాజు(సురేష్) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పేద మహిళలకు బర్త్ డే కేక్ ను కట్ చేయించారు. ఈ సందర్భంగా 500మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కామరాజుతో పాటు ప్రెసిడెంట్ నాయకులు పఠాన్ ఆరిఫ్ ఖాన్, అమానుల్లా, యేసేబు, ఏలీయా, ఏడుకొండలు, జగ్గర్, జాఫర్, సైదుల్లా, శేఖర్, శ్రీను, రమేష్, విజయ్, వార్డు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, గృహ సారథులు, వలంటీర్లు, పాల్గొన్నారు.

సామాజిక భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో నిరుపేదలైన గిరిజనులు నివసించే కాలనీల్లో సామాజిక భవనాలు నిర్మించి, వారిని అభివృద్ధి చేయాలని జిల్లా ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి జిల్లా అధికారులను కోరారు. గిరిజన కాలనీలకు మౌలిక వసతులు కల్పించి, వారికి గిరిజన సంక్షేమ పథకాలు అందించి, సమాజంలో సాంఘికంగా, ఆర్థికంగా, సామాజికంగా, అభివృద్ధిచేయాలన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతల కలలు కన్నా ఆశయాలను ప్రజాప్రతినిధులు, అధికారులు, త్రికరణ శుద్ధిగా ఆచరించి గిరిజనులు చైతన్య పరచి ప్రభుత్వ పథకాలు అందుకునే విధంగా వారిని ప్రోత్సహించి కాలనీలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సందర్శించి వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు.

జలాశయం నీరు విడుదల

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండల పరిధిలోని నక్కల గండి జలాశయం నుంచి నీటిని ఆనారికంగా విడుదల చేశారు. దీంతో ఆయకట్టు ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే పొలాలు సాగు చేసుకునేటప్పుడు నీరు ఇవ్వమంటే అధికారులు సవాలక్ష ఆంక్షలను చెబుతారు. ఇప్పుడు వాటిల వేటకి సంబంధించి నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ నీటిని వదిలేశారు. ఇలాగే వదిలేస్తే భవిష్యత్తులో జలాశయంలో నీరు ఉన్నందువల్ల ఈ గొట్టపు బావులు సైతం పూటలు పెరిగి ఇక్కడపోకుండా ఉంటున్నాయి. ఎండాకాలం ఎండలు మండిపోతుంటే ఈ విధంగా నీటిని వృథాగా వదిలి పెట్టడంతో భవిష్యత్తులో ఏ విధంగా ఉంటుందో కనీసం ఈ ఏడాదైనా పంటలు సాగు చేసుకోవాలని ఎంతో ఆశ్తో ఉన్న రైతులు రాజకీయ నాయకులు అండదండలతో నీటిని వదిలేయడంతో అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు.

6వ తేదీ నుంచి ఉత్సవాలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని గుంపర్లపాడు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక ధర్మకర్త దూది సుబ్బయ్య తెలిపారు. 6 తేదీన అంకురార్పణ ధ్వజారోహణ అశ్వవాహన సేవ 7 తేదీన హనుమంత సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 8వ తేదీన గురువారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

టిబి రహిత సమాజ నిర్మాణానికి కృషి

ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ వెంకట ప్రసాద్

ప్రజాశక్తి-నెల్లూరు

గతంలో క్షయ, (టిబి) వ్యాధి అంటే ప్రజలు తీవ్ర భయాందోళనలకు లోనౌతుండేవారు. వైద్యశాస్త్రం వేగంగా అభివృద్ధి చెంది అనేక వ్యాధుల నియంత్రణకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్‌లను ఆసుపత్రులల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందజేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో టిబివ్యాధి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటుందో ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ వెంకట ప్రసాద్ మాటల్లో ...



ప్రశ్న. 2021, 2022 సంవత్సరాలలో ఎంత మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.. ఎంతమందికి టి.బి. ఉన్నట్లు నిర్ధారణ అయింది. క్షయ వ్యాధితో బాదపడుతున్న వారికి ఎంత మందికి హెచ్‌ఐవి పరీక్షలు నిర్వహించారు.? ఎంత మంది మరణించారు.?

జవాబు. 2021లో ప్రభుత్వం 38,122 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. అయితే వైద్య ఆరోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థల సంయుక్త కృషితో 41,400 పరీక్షలు నిర్వహించాం. 5,597మందికి టి.బి. లక్షణాలు ఉన్నటు నిర్ధారణ అయింది. 56 మంది మరణించారు. జిల్లాలో క్షయ వ్యాధితో బాదపడుతున్న వారికి హెచ్‌ఐవి నిర్ధారణ పరీక్షలు చేయగా 4,690 మందికి లక్షణాలు ఉన్నట్లు గుర్తించాం. 2022వ సంవత్సరంలో 3804 మందికి టి.బి. నిర్ధారణ అయింది. చికిత్సలు తీసుకుంటున్న సమయంలో 25 మంది మృతి చెందారు. 2020 సంవత్సరంలో క్షయ వ్యాధి గ్రస్తులకు పూర్తి స్థాయిలో మందులు, ఒక క్రమపద్ధతిలో వాడటంతో 3,324 మంది టి.బి.ని జయించారని చెప్పడానికి ఎంతో ఆనందంగా ఉంది. 2021లో టిబి వ్యాధిగ్రస్తులు చక్కెర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోగా 4,435 మందికి మధుమేహ వ్యాధి నిర్ధారణ అయింది.

ప్రశ్న. జిల్లాలో ఎంత మంది మల్టీడ్రగ్ రెసిస్టెంట్ క్షయ వ్యాధిగ్రస్తులున్నారు. ఈ మందులు వాడటం వల్ల ఇప్పటి వరకు ఎంత మంది టిబిని జయించారు..? ఈ ఏడాది ఎంత మంది టి.బి. వ్యాధి గ్రస్తులు ప్రభుత్వ చికిత్సలు తీసుకుంటున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది.?

జవాబు. జిల్లాలో 2019వ సంవత్సరంలో మల్టిడ్రగ్ రెసిస్టెంట్ మందులను వైద్యుల సలహాలు, సూచనల మేరకు 251 మంది తీసుకున్నారు. 199 మంది పూర్తి ఆరోగ్యవంతులుగా కోలుకున్నారు. 2021లో 205 మందికి మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ మందులు అవసరమని ప్రభుత్వం గుర్తించి బాధితుల పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వీరందరికీ ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో మందులు పంపిణీ చేస్తున్నాం. ప్రయివేట్ వైద్యశాలల్లో పనిచేస్తున్న వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి టి.బి. వ్యాధిగా గుర్తించి వారి వివరాలను జిల్లా క్షయ నియంత్రణ శాఖకు అందజేస్తే వైద్యులకు ప్రోత్సహకంగా రూ.1000లు ప్రభుత్వం అందజేస్తుంది. అదే విధంగా టి.బి. వ్యాధితో బాధపడుతున్న వారు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకొనేందుకు ప్రతి నెలా రూ.500 వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తుంది. జిల్లాలో ప్రస్తుతం 3,800 మందికి పైగా టి.బి. వ్యాధి గ్రస్తులు ప్రభుత్వ వైద్యం తీసుకుంటూ కోలుకుంటున్నారు.

ప్రశ్న. లెప్రసీ వ్యాధి లక్షణాలు ఏమిటీ.. ఎలా వ్యాపిస్తుంది.. చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయా..?

జవాబు. శరీరంపై పోలిపోయిన, రాగి రంగులో మచ్చలు ఏర్పడినా.. ఆ మచ్చలపై స్పర్శ లేక నొప్పి లేకపోయినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. శరీరంలో ముఖ్యంగా పాదాలు, చేతులు, వేళ్ల తిమ్మెరలు పెడుతునా, చర్మం దళసరిగా మారిపోతున్నా. ముఖ్యంగా ముఖం నూనె రాసినట్లు నిగనిగలాడుతూ కనిపిస్తే కుష్టు వ్యాధి లక్షణాలుగా భావించి వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. లెప్రసీ వ్యాధి వల్ల శరీరం అంతా పుండ్లుతో నిండిపోతుంది. ఇది చర్మానికి, నాడీ వ్యవస్థకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధి. మ్యూకస్ పొరను ప్రభావితం చేస్తుంది. క్షయ కారకమైన మైక్రోబ్యాక్టీరియాకు చాలా దగ్గర సంబంధం ఉంటుంది. ఈ బ్యాక్టీరియా పేరు మైక్రో బ్యాక్టీరియం లెప్రేగా పిలుస్తారు. ముఖ్యంగా ఛాతీ, పొట్టపైన పొక్కులు లేవడం కనిపిస్తుంది. కుష్టు వ్యాధి ఇతర అంటువ్యాధుల వలే ఒక సూక్ష్మక్రిమి వల్ల వస్తుంది. 1873 సంవత్సరం హాన్‌సన్ అను నార్వే శాస్త్రవేత్త ఈ వ్యాధికి కారణమైన జీవిని సూక్ష్మదర్శనిలో గుర్తించాడు. ఈ వ్యాధి వ్యాధిగ్రస్తుని నుండి గాలి ద్వారా, సన్నిహిత సంబంధాల ద్వారా ఇతరులకు సులువుగా వ్యాప్తి చెందుతుంది.

ముఖాముఖి



ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

సంజీవని ఆరోగ్య రథంతో ఉపయోగం

ప్రజాశక్తి-ఉదయగిరి

సంజీవని ఆరోగ్య రథం సేవలు నియోజకవర్గం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్న కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని గంగులవారిచెరువుపల్లిలో చేపడుతున్న వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటుగా ఉచితంగా మందులు పంపిణీతో కూడిన వైద్య సేవలందించడంపై కాకర్ల సురేష్‌ను గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ రోజు సంజీవని ఆరోగ్య రథంతో 115 మంది గ్రామస్తులు డాక్టర్‌ను వివిధ ఆరోగ్య సమస్యలతో సంప్రదించి 78 మంది కంటి చూపు సమస్యలకు చికిత్స అందించారని తెలిపారు. వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. అనంతరం టిడిపి కార్యకర్తలను ఆదుకునే కార్యక్రమంలో భాగంగా, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు అనంతరాజు శ్రీనివాసరాజుకు రూ.20 వేల ఆర్థిక సహాయం, గంగులవారి చెరువుపల్లి గ్రామంలో అంగ వైకల్యంతో బాధపడుతున్న అనంతరాజు పవన్ తేజ, కప్ప వెంకట రామరాజు, కప్ప లక్ష్మి దేవిలను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. అదే గ్రామంలో ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన ఓంకారం మౌనికను అభినందించి ప్రోత్సాహకంగా రూ.5వేలను అందించామన్నారు. కార్యక్రమంలో కాకర్ల వెంకటేశ్వర్లు, కప్ప పెంచలరాజు, అనంతరాజుల శ్రీనివాసరాజు, కప్ప వెంకటరామరాజు, కప్ప నరసింహారాజు, శేఖర్, బిల్లుపాటి పెంచలయ్య యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం..

ప్రజాశక్తి-ఉదయగిరి

బిజెపి ప్రభుత్వం నుండి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని జిల్లా సిపిఎం కార్యదర్శి మూలం రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశ ప్రజల కష్టాలు మరింత పెరిగాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేయడం కుల మతాలను రెచ్చగొట్టడం బడుగు బలహీన పేద మైనార్టీ వర్గాలపై దౌర్జనకాండకు దిగడం తప్ప దేశానికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. పోరాడి సాధించిన కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి యాజమాన్లకు అనుకూలంగా కొత్త చట్టాలను చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరును ప్రశ్నించే వారిని గొంతు నొక్కడం మరోవైపు అధిక ధరలతో పేదవాడి నడ్డి విరుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మోడీ చర్యలను సమర్థిస్తున్న రాష్ట్ర అధికార ప్రతిపక్షాలను ఎండగట్టుటకు జిల్లాలో వెనకబడ్డ మెట్ట ప్రాంతాల అభివృద్ధి కోసం భవిష్యత్తులో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు కె.అజయ్ కుమార్, ఎంపిటిసి కాకు విజయ మండల నాయకులు ఫరిద్దీన్‌భాషా, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, రమణయ్య, తిరుమలయ్య, కాకు వెంకటయ్య, మహిళా ఐద్వా నాయకురాలు కామాక్షమ్మ, స్వరాజ్ బాబు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-కావలి

కావలి టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపేలా టిడిపి మేనిఫెస్టోను రూపొందించిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, కావలి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి కుటుంబ సభ్యులందరూ, ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా టిడిపి రైతు సంఘం నాయకులు, తెలుగు మహిళా నాయకురాళ్లు, తెలుగు యువత సభ్యులు కలసి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సుబ్బానాయుడుతో కలిసి వక్తలు మాట్లాడుతూ మహానాడు వేదికగా టిడిపి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం పరంగా చేయబోతున్న పథకాలను చంద్రబాబు నాయుడు వెల్లడించారన్నారు. 18 ఏళ్ల నుండి 59 ఏళ్ల వరకు ఉన్న మహిళలకు కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇంట్లో ఎంతమంది బిడ్డలు ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తామని చెప్పి, జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు అన్యాయం చేశారన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక కుటుంబంలో ఎంత మంది బిడ్డలు చదువుకుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేల చొప్పున ఇస్తామని ప్రకటించారన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే ఎంత మంది ప్రయోజకులు కావాలని విద్యనభ్యసించాలని, టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎటువంటి ఆంక్షలు లేకుండా తల్లికి వందనం అందిస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం అందజేయబోతున్నామని దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఇవ్వబోతున్నామని తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారని, యువగళం నిధి కింద నిరుద్యోగులకు నెలకు రూ.3000 అందజేయ బోతున్నామని తెలిపారు. అన్నదాత పథకం కింద రైతులకు రూ.20 వేలు ఇవ్వబోతున్నామని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రూ.13500 మాత్రమే ఇస్తున్నారని టిడిపి ప్రభుత్వం వచ్చాక రూ.20వేలు ఇస్తామని ప్రకటించారన్నారు. ఈ పథకాలన్నీ అమలు చేయడం అంత సులభమేమీ కాదని రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని అయితే చంద్రబాబు నాయుడు ఆయన అనుభవంతో సంపద సృష్టించి వీటిని అమలు పరుస్తారన్నారు. భవిష్యత్తులో మహిళల రక్షణ కోసం లా అండ్ డాక్టర్ కోసం పాలసీని తీసుకొస్తామని, పూర్తిస్థాయి మేనిఫెస్టోలో వాటిని పొందుపరుస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరు బిడ్డల ఆంక్షలు ఎత్తివేయబోతున్నారని తెలిపారు. యువశక్తి నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని ఎక్కడ కూడా మాటల హామీలు ఇవ్వడం లేదని శిలా శాసనాలు శిలాఫలకాలు రాసి హామీలు ఇస్తున్నారని భవిష్యత్తులో తాము ఇచ్చిన హామీలు తమకు ఎవరూ గుర్తు చేయాల్సిన అవసరం లేదని శిలాఫలకాల ద్వారా మేమే వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకురాళ్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



ఎన్‌సిసి విద్యార్థులకు ఫైరింగ్ శిక్షణ

ప్రజాశక్తి-కొడవలూరు

10వ ఆంధ్ర నావల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్ సారథ్యంలో కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్.సి.సి. కేడెట్లకు 7వ వార్షిక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయుధ శిక్షణ, గన్ ఫైరింగ్ కవాతు, జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి విడవలూరు జాషువా, ఫైర్మన్లు కె.కమలాకర్, రమేష్ బాబు తదితరులు అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై వివరించారు. కొత్తూరు సమీపంలోని అటవీ ప్రాంతంలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో కేడెట్లకు ఫైరింగ్ శిక్షణ సెకండ్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు నేతృత్వంలో హవల్దార్ బ్రిజ్‌పాల్‌సింగ్, పెట్టీ ఆఫీసర్ శివప్రసాద్ శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సెకండ్ ఆఫీసర్ సి.వి.నాగరాజు, థర్డ్ ఆఫీసర్లు ఎస్.విద్యాసాగర్, కె.మస్తానయ్య, ఎన్‌సిసి స్టాఫ్ సూరజ్ బగేల్, వెంకటేష్ రాథోడ్, నీలేష్, అరుణ్ శర్మ, రామన్, తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలనను అరికట్టాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలో దుర్మార్గపు దౌర్భాగ్య పరిపాలన కొనసాగుతుందని, దానిని అంతమొందించేందుకు ప్రజలందరూ సహకరించాలని మాజీ మంత్రి, వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరులో ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 40 యేళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి పాలన చూడలేదని ఘాటైన విమర్శలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న అరాచకాలను బాధ్యతారహిత్య పాలనను వివరించారు. పరిపాలన రాజ్యాంగబద్ధంగా లేదన్నారు. రాష్ట్రంలో అక్కడ ముఖ్యమంత్రి మధ్యలో జిల్లా కలెక్టర్ వార్డుకు వచ్చేసరికి వలంటీరు ఇలా మూడంచెల పాలన సాగుతుందన్నారు. గృహ సారథుల వ్యవస్థను తెచ్చి వారికి సర్వాధికారాలు ఇచ్చారన్నారు. వీటన్నింటికీ ఉత్తర్వులు ఉండవని రాజ్యాంగబద్ధత ఉండదని కేవలం నోటిమాటగా కాలం గడుపుతున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల ముందు వరకు ఏ ప్రాజెక్టుల పనులు సాగుతున్నాయని, ఇప్పుడు 4 ఏళ్లు నుండి ఎందుకు పనులు చేపట్టడం లేదని, ప్రజలు గమనించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వంకు కర్తవ్యంపై బాధ్యత లేదని, నిర్లక్ష్యం విరిగిపోయిందని తెలిపారు. జిల్లా స్థాయి సమావేశాలు కూడా పరిపూర్ణత లేదన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే చీప్ లిక్కర్ తాగే మనిషి లివర్‌పై ప్రభావం చూపుతుందని తెలిపారు. అలాంటి విష పదార్థాలు ఉన్న ప్రమాదకరమైన చీప్ లిక్కర్ వాడకంలోకి తెచ్చి దానికి అలవాటు పడిన వ్యక్తుల ప్రాణాలతో మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశమంతా జిఎస్‌టి విధానంలో అమ్మకాలు ఉంటే లిక్కర్ పాలసీలో ఆ జిఎస్‌టి ప్రకారం బిల్లులు ఇచ్చేది లేదన్నారు. కోట్ల మంది ప్రజల అవయవాలు దెబ్బతీస్తే విష పదార్థాలు ఉన్న చీప్ లిక్కర్ ఆదాయం ఎవరికి చేరుతుందని ప్రశ్నించారు. ఇసుక దొరకని దగ్గరికి పెన్నానదిలో ఇసుక అంతా తరలిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో 15యేళ్ల క్రితం మొదలుపెట్టిన పనులు ఇప్పటికీ పూర్తి చేసుకోలేకున్నారని ఎద్దేవా చేశారు. వరదలకు సోమశిల జలాశయం వద్ద రక్షణ కట్టడాలు కోతకు గురయ్యాయని పేరుకు పనులు కోసం రూ.99 కోట్లు మంజూరయ్యాయ న్నారు. పనులు చేపట్టిన గుత్తేదారులకు పైసా బిల్లు ఇవ్వక పోవడంతో పనులు ఆపేసారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డి



తెలుగు యువత పట్టణ కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-కావలి


కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ టిడిపి తెలుగు యువత పట్టణ కమిటీని ప్రకటించారు. అధ్యక్షులు గాకావేటి శివకుమార్‌ను, వారి కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, కావలి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, అత్యధిక సంఖ్యలో కావలి పట్టణ టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు. పట్టణ పార్టీ తెలుగు యువత ఉపాధ్యక్షులుగా కొమరగిరి లోకేష్, మందా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పెయ్యల శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిలు గుడిపల్లి లోకేష్, పిలిమిట్ల వెంకటనారాయణ, పఠాన్ అమీర్‌ఖాన్, కార్యదర్శులుగా కుంచాల ప్రేమ్ కుమార్, కట్ట కళ్యాణ్, ఆంద్రపాటి మణి కిరణ్‌లుగా ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా కావలి పట్టణ తెలుగు యువత కమిటీ ఎల్లప్పుడూ పనిచేస్తుందని, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని ఇన్‌ఛార్జికి హామీనిచ్చారు. ఈ సందర్భంగా సుబ్బా నాయుడు మాట్లాడుతూ పార్టీకి యువత వెన్నెముక లాంటిదని, యువత వల్లే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, పార్టీ పటిష్టతకు తమ వంతు సహాయ సహకారాలు అందించి రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. యువగళం పేరుతో నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర త్వరలో కావలి నియోజకవర్గానికి చేరుకోబోతుందని, అందులో భాగంగా ఈ యువత కమిటీ కీలక బాధ్య తలు వహించి దిగ్విజయం చేయబోతుందన్నారు.

ఎంఎల్‌ఎ రామిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కావలి



కావలి నియోజకవర్గ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం కావలి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం కావలి పాతూరు కృష్ణుడు బొమ్మ సెంటర్ వద్ద నుండి సుమారు 500మంది యువతతో కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసానికి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తదుపరి కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చేతుల మీదగా భారీ కేక్ కటింగ్ చేశారు. అనంతరం యువతతో బ్లడ్ డొనేట్ కార్యక్రమంలో ఎం.ఎల్.ఎ. పాల్గొన్నారు. ఈ సందర్భంగా 101మంది యువకులు రక్త దానం చేశారు. మధ్యాహ్నం పట్టణంలో 5కేంద్రాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రజాశక్తి-బిట్రగుంట : కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం బోగోలు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కన్వీనర్ మద్దీబోయిన వీరరఘు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ మంచికి మారుపేరైన మా నాయకులు కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని వేడుకుంటున్నామన్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు తూపిలి పెంచలయ్య, పర్రి అంకులయ్య,మేకల శ్రీనివాసులు, తుమ్మల రమణయ్య, మునగాల జనార్ధన్ రెడ్డి, నాయాబ్ రసూల్, పాపయ్య, సుందర్ రాజ్, శేఖర్, షమీ, వార్డ్ మెంబర్ శ్రీనివాసులు, పర్రి రాఘవ, దాసరి సురేష్, సాగర్, ఎండ్లూరి శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

- ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

అతివేగంతో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన దుత్తలూరు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు... మండలంలోని కృష్ణంరాజు పల్లికి చెందిన కొండూరు రాజేంద్ర కుటుంబ సభ్యులతో తన స్వగ్రామంలో గత మూడు రోజుల క్రితం జరిగిన సీతారాముల కళ్యాణానికి వచ్చి తిరుగు ప్రయాణంగా ఆదివారం కారులో నెల్లూరు వెళ్తున్న నేపథ్యంలో దుత్తలూరు వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను గుద్ది పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రాజేంద్ర కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. వారందరినీ స్థానికులు హుటాహుటిన పామూరు ప్రభుత్వ వైద్యశాలకు 108 సహాయంతో తరలించారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి మర్రిపాడు

మండలంలోని పొంగూరు కండ్రిక సమీపంలోని నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఆదివారం ఒంగోలు నుండి మర్రిపాడుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు.

గంగమ్మ తల్లికి పొంగళ్లు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలం గంగపాలెంలో గంగమ్మ తల్లికి పొంగళ్ల కార్యక్రమాన్ని గ్రామస్తులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం గంగమ్మ తల్లికి భక్తులు భక్తి శ్రద్ధలతో పలు రకాల పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వారి బంధుమిత్రులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.